నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తనునాయని పేట్‌బషీరాబాద్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.
వైష్ణవి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలోని వైష్ణవి ఎన్‌క్లేవ్, ఎస్‌ఎల్‌ఎన్ అపార్ట్‌మెంట్స్, వనం స్కేర్, డిమార్ట్ ఏరియా, హర్ష హాస్పిటల్, కల్యాణ్ కన్‌స్ట్రక్షన్స్ ప్రాంతాల్లో ఉదయం 6గంటల నుంచి 6.30గంటల వరకు...
అదే విధంగా సెయింట్ ఆన్స్ ఫీడర్ పరిధిలోని రెనోవా ఆస్పత్రి, ఎన్‌సీఎల్ కాలనీ, భారతి అపార్ట్‌మెంట్స్, సెయింట్ ఆన్స్ స్కూల్, పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ప్రాంతాల్లో ఉదయం 7.30గంటల నుంచి 8గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

గాజులరామారం సబ్‌స్టేషన్ పరిధిలో...

సుభాష్‌నగర్: గాజులరామారం సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈ చైతన్య భార్గవ్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ మెట్‌కానిగూడ ఫీడర్ పరిధిలోని శ్రీవెన్ ఎన్‌క్లేవ్, ఓక్షిత్ ఎన్‌క్లేవ్, వీనస్ ఎన్‌క్లేవ్, దేవభూమినగర్, ఆదర్శనగర్, మెట్‌కానిగూడ, పెద్దమ్మనగర్, కృష్ణమహాలక్ష్మినగర్, శారదా కాలనీ, ఎలగెన్స్ అపార్ట్‌మెంట్స్, చిత్తారమ్మ ఆలయం వెనుక గల్లీ, సోమిరెడ్డి వెంచర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
నిజాంపేట్: కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటు నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని నిజాంపేట్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. బృందావన్‌హిల్స్ ఫీడర్ పరిధిలోని బృందాన్ హిల్స్, సైదప్ప బస్తీ, మధురనగర్ ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 9గంటల వరకు..

బాచుపల్లి సెక్షన్ పరిధిలో..

- బీవీఆర్‌ఐటీ ఫీడర్ పరిధిలోని బీవీఆర్‌ఐటీ కళాశాల, సత్యం వ్యాలీ, విస్పర్ వ్యాలీ, పూజిత లేఅవుట్ ప్రాంతాల్లో ఉదయం 6.30 నుంచి 7గంటల వరకు..
- నిజాంపేట్ ఫీడర్ పరిధిలోని బాచుపల్లి గ్రామం, ఇందిరనగర్, కేజీఎం ఎన్‌క్లేవ్, శ్రీనిధి హిల్స్ పార్క్, ఎస్‌వీఎస్ అబర్న, కాకతీయనగర్‌లో ఉదయం 7 నుంచి 7.30 గంటల వరకు...
- జీపీఆర్ లేఅవుట్ పరిధిలోని జీపీఆర్ లేఅవుట్, ఐడీపీఎల్ కాలనీల్లో ఉదయం 7.30 నుంచి 8గంటల వరకు...
- ఏసీ టైర్స్ ఫీడర్ పరిధిలోని కేఆర్‌సీఆర్ కాలనీలో ఉదయం 8 నుంచి 8.30గంటల వరకు..
- మా విల్లాస్ ఫీడర్ పరిధిలోని మమత హాస్పిటల్, బొల్లారం ఇండస్ట్రియల్ ఏరియా ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 9గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

27 నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ ఎన్‌సీఎల్ సౌత్ కాలనీలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 27 నుంచి వచ్చే జూన్ 3వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. మొదటిరోజు అధ్యాయనోత్సవాలతో ప్రారంభం అవుతుందన్నారు. 29 అంకురార్పణ, 30న ధ్వజారోహణం, 31న శ్రీ సుదర్శన నరసింహ హోమం, జూన్ 1వ తేదీన ఉదయం హనుమాన్ జయంతి, సాయంత్రం తిరుకల్యాణ మహోత్సవం, 2వ తేదీన హోమం, తిరువీధి ఉత్సవం, 3వ తేదీన లక్ష్మీనారాయణ హోమం ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కోరారు. గతంలో జరిగిన బ్రహ్మోత్సవాలను దృష్టిలో పెట్టుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

కార్మికుల శ్రేయస్సు కోరే పార్టీ కాంగ్రెస్



పరిశ్రమ ఎండీతో చింతల నాగరాజు

జీడిమెట్ల: పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు కాంగ్రెస్ పార్టీ పక్షాన నిలబడి సునీతామహేందర్‌రెడ్డి గెలుపుకోసం వారు చేసిన కృషి గొప్పదని ఐఎన్‌టీయూసీ నేత చింతల నాగరాజు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం చింతల నాగరాజు జీడిమెట్లలోని థర్మోకేబుల్ పరిశ్రమలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో చింతల నాగరాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కార్మికుల శ్రేయస్సు కోరుకుంటుందన్నారు. దేశంలోని ప్రజలంతా రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయాలని కోరుకుంటున్నారని అన్నారు. మల్కాజిగిరిలో సునీతామహేందర్‌రెడ్డి లక్ష మెజార్టీతో తప్పకుండా గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ వర్మ, జీఎం రిషికుమార్, హెచ్‌ఆర్ మనోహర్ హెగ్డే, యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

డిజిటల్ తరగతి గదుల ప్రారంభం

ఉస్మానియాయూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతి గదులను శుక్రవారం వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ ప్రారంభించారు.

ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



నిజాంపేట్ గృహకల్పలోని ఆంజనేయస్వామి ఆలయంలో సీతామాత జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మహిళలు

నిజాంపేట్: సీతామాత జన్మోత్సవాన్ని శుక్రవారం విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిచారు. నిజాంపేట రాజీవ్‌గృహకల్పలోని ఆంజనేయస్వామి ఆలయంలో వైశాఖ శుద్ధ నవమి రోజును పురస్కరించుకుని అభిషేకం, పూజలు, భజనలు నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ విశ్వకర్మ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశం, డాక్టర్ ఎంఆర్‌ఎస్ రాజుల పర్యవేక్షణలో జరిగిన ఉత్సవానికి విచ్చేసిన భక్తులకు ఎస్‌వీఎం ఇన్‌ఫ్రా నిర్మాణ సంస్థ సౌజన్యంతో అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. మమత నేతృత్వంలో వాసవీ భక్త బృందం మహిళల కోలాటం ఆడారు. రామారావు భక్తి పాటలు, భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో జనార్దనారెడ్డి, వరలక్ష్మి, రామచంద్ర నాయక్, నరేశ్‌గుప్తా, అశోక్, కుమారస్వామిరెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఈసారి ఓక్షిత్‌కు జలగండమే.!

- పాత నాలా పూడ్చివేసి.. కృత్రిమ నాలాకు తెరలేపి.!
- రూ.18కోట్లతో మరో చోటు నుంచి నాలా పనులు ప్రారంభం



ఓక్షిత్ ఎంక్లేవ్‌లో గతేడాది కురిసిన వర్షానికి జలవలయంలో కాలనీ



ఇళ్ల మధ్య నుంచి మరో కృత్రిమ నాలాను ఏర్పాటు చేస్తున్న అధికారులు

సుభాష్‌నగర్: వర్షాకాలం వస్తుందంటే ఆ కాలనీ ప్రజల గుండెల్లో గుబులు పుడుతుంది. అక్కడ చినుకు పడితే ఆ కాలనీ ప్రజలు జలవలయంలో చిక్కుకోవాల్సిందే. ఇలా ఇప్పటికీ గత రెండు సంవత్సరాల పాటు వర్షాకాలంలో ఆ కాలనీ వర్షపునీటిలో మునిగిపోయింది. దీనంతటికీ కారణం వెంచర్ చేసిన కొంతమంది ఘనులు ఆ కాలనీ గుండా వెళ్లే రెండు నాలాలను కబ్జా చేసి వాటిపై ప్లాట్లు చేయడమే చెప్పవచ్చు. ఫలితంగా వర్షం పడిన ప్రతిసారి నీరు దిగువ ప్రాంతానికి వెళ్లేందుకు మార్గం లేక ఆ కాలనీ జలవలయంలో చిక్కుకుని స్థానికంగా ఉన్నవారు పడరాని పాట్లు పడుతున్నారు. చాలామంది అక్కడ ఖాళీ చేసి వేరే ప్రాంతాలకు వెళ్లిపోగా.. మిగతావారు లక్షలు పెట్టి కొన్న ప్లాట్లల్లో ఇల్లు కట్టుకొని వాటిని వదల లేక, ఇబ్బందులు పడుతూ కాలం వెళ్లదీస్తూ వస్తున్నారు. గతంలో ఎదుర్కొన్న ఇబ్బందులను తలుచుకుంటే, ఈ వర్షాకాలం ఎలా గడిచిపోతుందోనంటూ బిక్కుబిక్కుమంటున్నారు. కానీ అధికారులు మాత్రం అక్రమార్కులకే ఆజ్యం పోస్తూ, కోట్లు ఖర్చుపెట్టి చేపట్టిన అభివృద్ధి పనులను ధ్వంసం చేసి, మరో కృత్రిమ నాలాకు తెరలేపారు.

- గాజులరామారం డివిజన్ పెద్ద చెరువు దిగువ భాగాన మోక్షిత్ ఎంక్లేవ్ ఫేజ్- 1, ఫేజ్- 2, కాలనీలు వెలిశాయి. గతంలో వెంచర్ ప్రారంభించే సమయంలో స్థానికంగా ఉన్న రెండు నాలాలను అప్పటి అధికారులు అండదండలతో పూడ్చివేసి వాటిపై ప్లాట్లుగా చేసి, లక్షల రూపాయలకు విక్రయించి, కోట్ల రూపాలను అర్జించారు.

నాలాను మూసేసి..

రామారం చెరువు ఎగువ నుంచి అటవీ ప్రాంతాల నుంచే కాకుండా సుమారు 5 చెరువుల చెరువు నీరు ఆ చెరువులోకి వచ్చేది. ఆ చెరువు అలుగు పారితే దిగువ భాగాన సర్వే నం.91, 92,100,101,106,121,122,137,136,132,147,180,175,183,184,170, నంబర్ల గుండా ఉధృతంగా వెళ్లేది. ప్రస్తుతం ఆ నాలాను మూసివేయడంతో ఈ సమస్య తలెత్తింది.

- వీరు నాలా పూడ్చి వెంచర్ చేస్తున్న సమయంలో 3 సంవత్సరాల పాటు అంతంత మాత్రమే వర్షాలు పడ్డాయి. దీంతో వీరు అనుకున్న ప్లాన్ ఫలించింది. వెంచర్ పూర్తి అనంతరం ప్లాట్లు కొన్నవాళ్లు ఇల్లు కట్టుకోవడంతో 2022, 2023 భారీ వర్షాలు పడడంతో వీరు చేసిన మోసం బట్టబయలైంది. రెండు సంవత్సర వర్షాకాలం కాలనీ జలదిగ్బంధంలో చిక్కుకుని స్థానికంగా ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు..

వీరు చేసిన మోసాన్ని బట్టబయలు చేస్తూ ఓ వ్యక్తి 29 మార్చ్ 2022న గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేశారు. గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు రెవెన్యూ, ఇరిగేషన్, ఫారెస్ట్, జీహెచ్‌ఎంసి, హెచ్‌ఎండీఏ అధికారుల బృందం కబ్జా గురైన నాలాను పరిశీలించారు. ఇప్పటికే అలా 7 సార్లు పరిశీలించడం తప్ప సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

గుర్తించినవి 274.. మార్క్ వేసింది 24.. నోటీసులు ఇచ్చింది 22.!

గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు అధికారుల బృందం పరిశీలన అనంతరం ఇరిగేషన్, జీహెచ్‌ఎంసి, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో నాలాపై వెలసిన 274 నిర్మాణాలను గుర్తించారు. అందులో 24 నిర్మాణాలకు మార్కు వేశారు. కానీ 22 మందికి మాత్రమే నోటీసులు అందజేశారు. కానీ ఆ నిర్మాణాలపై గ్రీన్ ట్రిబ్యునల్ జీహెచ్‌ఎంసీని, ఇరిగేషన్ ప్రశ్నించినప్పటికీ ఇంత వరకు మాట దాటవేసి ప్రయత్నం చేస్తున్నారే తప్ప చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

కోట్ల రూపాయల అభివృద్ధిని ధ్వంసం చేస్తూ....

నాలాపై వెలసిన నిర్మాణాలను కాపాడేందుకు ఓక్షిత్ ఎంక్లేవ్ ఫేజ్-1,2లలో రోడ్ నం.2, 4 మీదుగా సదరు వ్యక్తి చిన్నపాటి పైపులైన్ వేశారు. ఆ వరద దాటికి ఆ పైపులైన్ ఏమాత్రం సరిపోలేదు. ఈ విషయమై అప్పట్లో ఇరిగేషన్ అధికారులు సదరు వ్యక్తిపై నాలా మళ్లించాడని జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తాజాగా అదే రోడ్డులో కోట్లు వెచ్చించి వేసిన సీసీరోడ్, భూగర్భ డ్రైనేజీ, మంచినీటి పైపులైన్లను అధికారులు ధ్వంసం చేసి మరో నాలా పనులను గత 20 రోజుల నుంచి ప్రారంభించారు. దీంతో ఆ రోడ్డు గుండా ఉన్న ప్రజలు ప్రతిరోజు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అధికారుల వల్లే...



ఓక్షిత్ ఎంక్లేవ్ లో ప్రతి వర్షాకాలం సమస్య తలెత్తుతుందంటే అధికారులదే ముమ్మాటికీ తప్పని చెప్పవచ్చు. అక్రమార్కులతో వీరు చేతులు కలిపి ఈ కుట్రలకు పాల్పడ్డారు. మా కాలనీ పక్క నుంచి నాలా ఉంటే మా ఇళ్ల మధ్య నుంచి మరో కృత్రిమ నాలాను తీస్తున్నారు. ఈ విషయమై అధికారులను ప్రశ్నిస్తే. మూడు రోడ్ల గుండా మీటరున్నర చొప్పున నాలా తీస్తున్నామని చెప్పారు. ముందు ఫేజ్- 1 లో రోడ్ నెంబర్ 2, ఫేజ్- 2 లో రోడ్ నెంబర్ 4 మీదుగా మీటరున్నర నాలా తీస్తున్నామని చెప్పి ఇప్పుడు ఏకంగా రెండు మీటర్లన్నర నాలాను నిర్మాణం చేపడుతున్నారు. ఈ నాలా పూర్తయితే, భూగర్భ డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ కు దారి లేదు. ఇక మా సమస్య ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు.

–గోపాల్‌రెడ్డి, కాలనీ ప్రెసిడెంట్



గతంలో అధికారులు నాలాపై వెలిసిన నిర్మాణాలపై వేసిన మార్క్



కృత్రిమ నాలా కోసం సీసీరోడ్డును ధ్వంసం చేస్తూ..



విద్యార్థుల నుంచి ఎండీఎంఏ, గంజాయి స్వాధీనం



పోలీసుల అదుపులో తిలక్‌సింగ్, అఖిల్ శివ



స్వాధీనం చేసుకున్న ఎండీఎంఏ, గంజాయి

జగద్గిరిగుట్ట: ఇద్దరు విద్యార్థుల నుంచి సైబరాబాద్ ఎస్‌ఓటీ మాదాపూర్, జగద్గిరిగుట్ట పోలీసులు ఎండీఎంఏ, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. జగద్గిరిగుట్ట, ఎస్‌ఓటీ మాదాపూర్ పోలీసులు శుక్రవారం ఉదయం తులసీనగర్‌లోని బాలకృష్ణ హైస్కూల్ వద్ద తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకోగా వారి వద్ద 3 గ్రాముల ఎండీఎంఏ, 45 గ్రాముల గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. జగద్గిరిగుట్ట షిర్డిహిల్స్‌లో నివాసముంటున్న డెహ్రాడూన్‌కు చెందిన డిగ్రీ విద్యార్థి తిలక్‌సింగ్(22), చెన్నైలో బీబీఏ చదువుతున్న తెల్లాపూర్‌కు చెందన జూలపల్లి అఖిల్‌శివ(22)లను అదుపులోకి తీసుకున్నారు.విజయవాడ పోరంకి ప్రాంతానికి చెందిన రోహిత్ అనే వ్యక్తి మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్నట్లు అంగీకరించారు. ఈ మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసిన పోలీసులు వారిని విచారిస్తున్నారు.

వరదనీరు నిల్వ ఉండకుండా కృషి చేస్తాం

కుత్బుల్లాపూర్: వరదనీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని పలు చోట్ల వాటర్ స్టాగ్నేషన్ పాయింట్లను ఆమె పరిశీలించారు. సుచిత్ర క్రాస్ రోడ్డు నుంచి ఆల్వాల్‌కు వెళ్లే రోడ్డులో ఉన్న స్టాగ్నేషన్ పాయింట్‌ను పరిశీలించిన జోనల్ కమిషనర్ మాట్లాడారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో వరదనీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు డ్రెయిన్‌ల ద్వారా తరలించే ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా వాటర్ స్టాగ్నేషన్ పాయింట్ల వద్ద చెత్త చేరకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తే వరదనీరు సాఫీగా వెళ్లేందుకు ఆస్కారం ముంటుందన్నారు. జోనల్ కమిషనర్ వెంట కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహ, ఇతర విభాగాల అధికారులు ఉన్నారు.



సుచిత్ర క్రాస్ రోడ్డులో వాటర్ స్టాగ్నేషన్ పాయింట్‌ను పరిశీలిస్తున్న జెడ్‌సీ అభిలాష

ఎయిర్ వాల్వ్‌ల నిర్వహణ గాలికి.!

రంగారెడ్డినగర్: ఎయిర్ వాల్వ్‌ల నిర్వహణను జలమండలి అధికారులు గాలికొదిలేశారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీనగర్ రోడ్డులో ఉన్న ఎయిర్‌వాల్వ్ రక్షణ కంచెను ఇటీవల ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓవైపు ఒరిగింది. ఎయిర్ వాల్వ్ పక్కనే నడుపుతున్న టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు రక్షణ కంచెపై వాటర్ బాటిల్, ఇతర సామగ్రిని ఉంచి సొంత అవసరాలకు వినియోగిస్తున్నాడు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా జలమండలి అధికారులకు కనబడకపోవడం శోచనీయం. ఎయిర్ వాల్వ్‌ల నిర్వహణ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.



గాంధీనగర్ రోడ్డులో ఉన్న జలమండలి ఎయిర్‌వాల్వ్ పరిస్థితి ఇది

ప్రాణం తీసిన మద్యం మత్తు

ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

మాదాపూర్: మద్యం మత్తులో కారును నిర్లక్ష్యంగా నడపడంతో ఒకరు మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం తెల్లవారుజామున మాదాపూర్‌లో నివాసముంటున్న దారు శ్రీనివాస్ (35) రోడ్డు పక్కన పాలు అమ్ముతుండగా, పాల లోడింగ్ కోసం టాటాఏస్ వాహనాన్ని (టీఎస్08యుజే4466) రోడ్డుపై నిలిపి రాఘవులు నిలబడ్డాడు. అదే సమయంలో రాజేశ్ (39) మద్యం మత్తులో కియా కార్నివాల్ (టీఎస్ 09 ఎఫ్ఎస్ 4499) కారులో హైటెక్ సిటీ నుంచి జూబ్లీహిల్స్ వైపునకు అతివేగంతో నిర్లక్ష్యంగా వాహనాన్ని నడుపుతూ రోడ్డు పక్కన నిల్చున్న శ్రీనివాస్, పక్కనే ఉన్న రాఘవులపై కారుతో దూసుకెళ్లాడు. స్థానికులు సమీప ఆసుపత్రికి తరలించగా శ్రీనివాస్ చికిత్సపొందుతూ మృతి చెందాడు. రాఘవులు చికిత్స పొందుతున్నాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లీకొడుకు అదృశ్యం



పావని (ఫైల్)



వెంకటేష్ (ఫైల్)

దుండిగల్: కుమారుడితో సహా ఓ మహిళ అదృశ్యమైన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భౌరంపేట్‌కు చెందిన భూపాల్, పావని(24)లు భార్యాభర్తలు. వీరికి వెంకటేష్ (04) కుమారుడు ఉన్నాడు. అయితే రెండు రోజుల క్రితం పావని తన కుమారుడిని తీసుకుని ఇంట్లో చెప్పాపెట్టకుండా వెళ్లిపోయింది. తన గురించి వెతకవద్దని, తాను సొంతంగా బతుకుతానని ఉత్తరం రాసి వెళ్లింది. ఆమె మొబైల్ ఫోన్‌కు ప్రయత్నిస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో దుండిగల్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కోదాడ కాంగ్రెస్ కోఆర్డినేటర్‌గా బండి శ్యామ్‌గౌడ్



చింతల్: నల్గొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కోదాడ నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేటర్‌గా కుత్బుల్లాపూర్‌కు చెందిన మల్కాజిగిరి లోక్‌సభ పార్లమెంటరీ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు బండి శ్యామ్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ నుంచి ఉత్తర్వులు వచ్చాయని బండి శ్యామ్‌గౌడ్ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో తమ పార్టీ అభ్యర్థిని గెలిపించుకుంటామని ఆయన 'సాక్షి'కి తెలిపారు.

బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీల కోర్సులకు అడ్మిషన్లు షురూ

- ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పణకు 20 చివరి తేదీ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం(సీఎస్‌ఐటీ) ద్వారా బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సులలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని 'మనూ' సీఎస్ అండ్ ఐటీ విభాగం అధిపతి ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్ శుక్రవారం తెలిపారు. యూనివర్శిటీలో ఈ విభాగాన్ని 2011లో ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రస్తుతం డిపార్ట్‌మెంట్ ప్రవేశ ఆధారిత రెగ్యులర్ బిటెక్, ఎంటెక్‌లో ప్రవేశానికి దరఖాస్తులను స్వీకరిస్తోందన్నారు. లాటర ల్ ఎంట్రీ ఎంసీఏ, ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సులకు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులను సమర్పించడానికి మే 20 చివరి తేదీగా నిర్ధారించడం జరిగిందన్నారు. బిటెక్ కోసం తీసుకొనే సామర్థ్యం 60 సీట్లు, బిటెక్ (లాటరల్ ఎంట్రీ)లో 8 సీట్లు, ఎంటెక్ (కంప్యూటర్‌సైన్స్) 30 సీట్లు, ఎంసీఏలో కూడా 30 సీట్లు ఉంటాయన్నారు. అయితే ఎంసీఏ (లాటరల్ ఎంట్రీ) లభ్యతకు లోబడి పరిమిత సీట్లు కలిగి ఉంటాయన్నారు. ఉర్దూ యూనివర్శిటీ నుంచి ఈ ప్రొఫెషనల్ కోర్సులలో ఉత్తీర్ణులైన ఆరికి ఉపాధి పొందడంలో విజయం సాధించినవారు చాలా మంది ఉన్నారన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫారమ్‌లు, ప్రాస్పెక్టస్‌లను యూనివర్శిటీ వెబ్‌సైట్‌లో అందుబాటుల ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 9866802414, 040– 23120600 (ఎక్స్‌టెన్షన్– 3603, 3610)లో సంప్రదించాలని సూచించారు.

మూగ జీవాల రక్షణకు కృషి చేయాలి

సనత్‌నగర్: హైదరాబాద్ నగరంలో ఇటీవల బ్లూ (సైబీరియన్ హస్కీ) అనే కుక్కపై జరిగిన దాడిని తెలంగాణ కెనైన్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. బంజారాహిల్స్‌లోని జంతు సంరక్షణ ఆస్పత్రిలో పుర్రెపై ఫ్రాక్చర్‌తో బాధపడుతున్న కుక్కను సందర్శించి దాని ఆరోగ్య పరిస్థితిని అక్కడి డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు విశాల్ సూదం మాట్లాడుతూ.. కుక్కలపై దాడి అనాగరిక, క్రూరమైన చర్యగా పేర్కొన్నారు. కుక్కల సంక్షేమం, రక్షణ కోసం అంకితమైన కెనైన్ సంస్థ ప్రతినిధులుగా తాము ఈ దాడి పట్ల తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యామన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే గాంధీని కలిసిన కొండాపూర్ నేతలు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెకపూడి గాంధీని బీఆర్‌ఎస్ పార్టీ కొండాపూర్ డివిజన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం ఆయన నివాసంలో కలిసి పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సరళిపై కొద్ది సేపు చర్చించారు. చేవెళ్ల పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కలిసి పని చేశారని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు.